
సాక్షి అనంతపురం

మంగళవారం, 20, ఆగస్టు, 2024



టమాట కిలో రూ.22

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికింది.



చీనీ టన్ను రూ.21 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం 37.5°/24.8°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత అధికంగా ఉంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



ఎస్పీ జగదీష్

అనంతపురం: జిల్లా నూతన ఎస్పీగా పి. జగదీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఆయనకు పోలీసులు ఘన స్వాగతం పలికారు. సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఎస్పీగా జగదీష్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ జగదీష్‌కు అదనపు ఎస్పీలు ఆర్. విజయ భాస్కర్ రెడ్డి, జి. రామకృష్ణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. డీఎస్పీలు టీవీవీ ప్రతాప్, రవికుమార్, శివ భాస్కర్ రెడ్డి, జనార్ధన్ నాయుడు, బీవీ శివా రెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, శ్రీనివాసులు నాయుడు, శివప్రసాద్, లక్ష్మీనారాయణ, ఆనంద్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పెద్దమ్మకు ఎస్పీ పూజలు

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో వెలసిన పెద్దమ్మ దేవాలయంలో ఎస్పీ జగదీష్ సోమవారం పూజలు నిర్వహించారు. గతంలో జంతలూరు బెటాలియన్ కమాండెంట్‌గా ఎస్పీ జగదీష్ పని చేశారు. ఈ సందర్భంగా బెటాలియన్ సిబ్బంది, ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు.

పోక్సో కేసులో మూడేళ్ల జైలు



అనంతపురం: పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష పడింది. ఈ మేరకు అనంతపురం పోక్సో కేసుల స్పెషల్ కోర్టు జడ్జి టి. రాజ్యలక్ష్మి సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020 ఆగస్టు 9న పోక్సో కేసు నమోదైంది. నిందితుడు గుడిమల్ల వినోద్ కుమార్ అలియాస్ మంగళ వినోద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్‌ఐ జమాల్ బాషా దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అన్ని కోణాల్లో కేసును జడ్జి రాజ్యలక్ష్మి సమగ్రంగా విచారించారు. నేరం నిర్ధారణ కావడంతో సోమవారం ముద్దాయి గుడిమల్ల వినోద్‌కుమార్‌కు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1,500 జరిమానా విధించారు. బాధితురాలికి రూ.1.50 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు.

వైద్య సేవల్లో జాప్యంపై ఫిర్యాదు చేయండి

అనంతపురం మెడికల్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవకి సంబంధించి సేవల్లో జాప్యం జరిగితే ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కో ఆర్డినేటర్ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 08554-247266 లేదా స్టేట్ కాల్ సెంటర్ 104కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. సచివాలయాల్లో ఏఎన్ఎంలను సంప్రదించి నెట్‌వర్క్ ఆస్పత్రులు, స్పెషలిస్టు వైద్య సేవల వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

పడకేసిన పల్లె వైద్యం

కూటమి ప్రభుత్వంలో అధ్వానం

2024 మార్చిలో ఫ్యామిలీ డాక్టర్ కింద జీవనశైలి జబ్బుల నిర్ధారణ, సేవలు ఇలా

కేటగిరీ	నిర్ధారణ
హైపర్ టెన్షన్	19,414
మధుమేహం	11,485
హైపర్ టెన్షన్-మధుమేహం	26,126
ఔట్‌పేషెంటు	4,235
రక్తహీనత	12,953
కంటి వెలుగు	10,363
పంపిణీ చేసిన కళ్లద్దాలు	7,685
ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్	30,652



గత ఏడాది సెప్టెంబర్‌లో అనంతపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు (ఫైల్)

- అసాంక్రమిక వ్యాధులు గుర్తించే వారు లేరు
- గర్భిణులు, బాలింతలపై శ్రద్ధ కరువు
- 'ఫ్యామిలీ ఫిజీషియన్' విధానం గాలికి
- 'కంటి వెలుగు'పై కమ్ముకున్న కారు మేఘాలు
- రోగమొచ్చినా పలకరించే వారు లేక పల్లెవాసుల సతమతం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'మీ ఆరోగ్యానికి మాది భద్రత' అన్న రీతిలో గత ఐదేళ్లూ పల్లెల్లో ఆరోగ్య సిబ్బంది కలియదిరిగే వాళ్లు. ఏ కష్టమొచ్చినా మేమున్నాం అంటూ మందులు, ఇంజెక్షన్లు ఇచ్చి అండగా ఉండేవారు. కానీ కూటమి సర్కారు వచ్చిన దగ్గరనుంచి పల్లెల్లో ఆరోగ్యం పడకేసింది. ఎవరికి ఎలాంటి జబ్బు చేసినా పలకరించే దిక్కు లేదు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు లేవు. మంచానికే పరిమితమైన వారిని పట్టించుకునే నాథుడే లేరు. డయేరియా లాంటి వ్యాధులను కూడా నియంత్రించే పరిస్థితి లేకుండా పోయింది. ప్రజారోగ్యం పరిస్థితి పల్లెల్లో కొడిగట్టిన దీపంలా మారింది.

వ్యాధులు గుర్తించేదెవరు..?

అసాంక్రమిక వ్యాధులపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు నిర్ధారణ పరీక్షలు చేసి మందులు ఇచ్చేవారు కరువయ్యారు. చాపకింద నీరులా విస్తరిస్తున్న బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధులను అరికట్టేందుకు గతంలో ఏఎన్ఎం, ఆశా వర్కర్ ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేసేవారు. ఇప్పుడు వాళ్లు ఎక్కడున్నారో తెలియదు. గర్భిణులు, బాలింతలకు రక్తహీన పరీక్షలు క్రమం తప్పకుండా జరిగేవి. రక్తహీనతతో బాధపడుతున్న వారిని ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయించి మందులు ఇచ్చే పరిస్థితి ఉండేది. ఇప్పుడు మచ్చుకైనా ఆ పరిస్థితి కనిపించడం లేదని మహిళలు వాపోతున్నారు.

104 అంబులెన్సులు ఏవీ..?

పక్షవాతం, ప్రమాదాల్లో గాయపడి మంచానికే పరిమితమైన వారికి గతంలో 104 వాహనాల ద్వారా నెలకోసారి వెళ్లి మందులిచ్చేవారు. రక్తపరీక్షలు చేసేవారు. ఇప్పుడా వాహనాలు ఎప్పుడొస్తున్నాయో తెలియని పరిస్థితి. పల్లెలకు ఈ వాహనాలు రాక నెలరోజులైందని గ్రామీణులు వాపోతున్నారు. మందులైపోతే పీహెచ్‌సీకి వెళ్లాలి లేదంటే జిల్లా కేంద్రానికెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

'కంటివెలుగు'పై కారు చీకట్లు

గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కంటివెలుగు కార్యక్రమం కింద వేలాది మందికి పరీక్షలు చేసి అద్దాలు ఇచ్చారు. వారి కళ్లలో వెలుగులు నింపారు. అలాంటి కార్యక్రమంపై నేడు కారుచీకట్లు కమ్ముకున్నాయి. వృద్ధులు కంటిపరీక్షలకు వెళ్లాలంటే దూరంగా ఉన్న ఆస్పత్రికి వెళ్లాలి లేదంటే ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది.

'ఫ్యామిలీ డాక్టర్'కు తిలోదకాలు

ఎంతో ముందు చూపుతో దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ఇద్దరు వైద్యులు, 104 వాహనంలో ఒకరిని గత జగన్ సర్కారు నియమించింది. ఆయా గ్రామాల పరిధిలో డాక్టర్లే వారి ఇళ్లవద్దకు వెళ్లి వైద్యం చేసేలా చర్యలు చేపట్టింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ విధానాన్ని నేడు పూర్తిగా ఎత్తేశారు. ఇప్పుడు డాక్టర్లు పల్లెలకు వచ్చే పరిస్థితి లేదు. గ్రామీణులకు, వైద్యులకు మధ్య ఉన్న అనుసంధానం తెగిపోయింది. నిత్యం పల్లెల్లో డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తిరిగేవారు. ఇప్పుడు ఎవరు ఎక్కడున్నారో తెలియని పరిస్థితి. డయేరియా విజృంభిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

వైద్య సిబ్బంది కన్నెత్తి చూడడం లేదు



బీపీ, షుగర్‌తో బాధపడుతున్నా. గత ప్రభుత్వ హయాంలో మా ఇంటి వద్దకే డాక్టరు, ఏఎన్ఎం వచ్చి బీపీ, షుగర్ చెక్ చేసి మందులు ఇచ్చేవాళ్లు. డాక్టరు నెలకు రెండు సార్లు వచ్చి చూసి వెళ్లేవారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఎవరూ మా ఇంటి వైపు చూడటం లేదు. మందులు ఇవ్వడం లేదు. దిక్కులేక కళ్యాణదుర్గం ఆసుపత్రికి పోతున్నాం.

– లక్ష్మిదేవి, దాసంపల్లి, కళ్యాణదుర్గం మండలం

దగ్గొచ్చినా పట్టణానికే



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు మా ఊర్లోకే 104 వాహనం వచ్చేది. డాక్టర్లు ఇక్కడే పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇచ్చేవారు. దగ్గు, జలుబు, జ్వరం, నొప్పులు ఇలా ప్రతి ఒక్కటీ చూసేవాళ్లు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. 104 వాహనం రావడం ఆగింది. చిన్న దగ్గు, జలుబు వచ్చినా ఇప్పుడు పట్టణానికి వెళ్తున్నాం.

– అరుణమ్మ, కదిరిదేవరపల్లి, కంబదూరు మండలం

డ్వాక్రా మహిళలపై 'టీడీపీ' పెత్తనం

- మంజూరైన లోను డబ్బు అందకుండా అడ్డుకుంటున్న వైనం
- ఆత్మకూరు మండలంలో ఘటన



ఆత్మకూరు వెలుగు కార్యాలయం

ఆత్మకూరు: డ్వాక్రా మహిళలపైనా టీడీపీ నేతలు పెత్తనం చలాయించాలని చూస్తున్నారు. బ్యాంకు ద్వారా మంజూరైన లోను డబ్బు అందకుండా అడ్డుకుంటున్నారు. బాధితులు రోజూ బ్యాంకు చుట్టూ తిరుగుతూ విసిగి వేసారిపోతున్నారు. వివరాలు.. ఆత్మకూరు మండలం పాపంపల్లికి చెందిన ఓ డ్వాక్రా సంఘానికి నెల రోజుల క్రితం స్థానిక బ్యాంకులో రూ.15 లక్షల లోను మంజూరైంది. సంఘంలోని 10 మంది సభ్యులు నగదు తీసుకోవడానికి బ్యాంకుకు వెళ్లగా... మీ సీసీ (వెలుగు కార్యాలయ సిబ్బంది) చెబితేనే నగదు ఇస్తామని అక్కడి సిబ్బంది చెప్పారు. సీసీని అడిగితే మీ గ్రామంలోని టీడీపీ నాయకుడితో మాట్లాడాలని సూచించారు. ఇందుకు ససేమిరా ఒప్పుకోని మహిళలు.. మళ్లీ బ్యాంకు సిబ్బందిని అడిగితే తామేం చేయలేమని చేతులెత్తేశారు. ఆర్థిక ఇబ్బందులున్న మహిళలు రోజూ ఇదే విషయమై బ్యాంకుకు రావడం, సిబ్బంది కాదనడంతో ఖాళీ చేతులతో వెనుదిరగడం చేస్తున్నారు. నెల రోజులుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని బాధిత మహిళలు వాపోయారు. ఈ విషయంపై ఏపీఎం మదన్‌మోహన్‌ను వివరణ కోరగా ఏరియా కో ఆర్డినేటర్‌తో మాట్లాడామని, త్వరలోనే నగదు అందేలా చేస్తామని తెలిపారు.

ఉత్తమ టీచర్ అవార్డుకు 25 లోపు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా స్థాయి ఉత్తమ టీచర్ అవార్డుకు ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని డీఈఓ బి.వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పూర్తి చేసిన దరఖాస్తుల రెండు సెట్లను 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత ఎంఈఓ/డీవైఈఓలకు అందజేయాలని పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను వారు పరిశీలించి రిమార్కులు నమోదు చేసిన అనంతరం ఈ నెల 28 సాయంత్రం 5 గంటల్లోపు డీఈఓ కార్యాలయంలో అందజేస్తారన్నారు.

ప్రజా సమస్యల్ని నిర్లక్ష్యం చేయొద్దు

- కలెక్టర్ బి.వినోద్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'ప్రజల సమస్యలను ఏ దశలోనూ నిర్లక్ష్యం చేయకూడదు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యను తెలుసుకోవాలి. ప్రతి అర్జీకి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపాలి' అని కలెక్టర్ వినోద్‌కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్ జె.శిరీష, జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ, జిల్లావ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 276 వినతులు అందాయి.

- ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీ ఆశావర్కర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.నాగవేణి విన్నవించారు. కొత్త ప్రభుత్వంలో ఆశాలపై రాజకీయ వేధింపులు అధికమయ్యాయని చెప్పారు. పనిభారం పెంచారే తప్ప అందుకు తగ్గ వేతనం ఇవ్వడం లేదన్నారు. బకాయి పడిన రూ.7,200 తక్షణం చెల్లించాలన్నారు. కళ్యాణదుర్గం అర్బన్ హెల్త్ సెంటర్లలో ఆశా వర్కర్లతో వ్యాక్సిన్ క్యారియర్లు మోయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీకెళ్లాలని కోరారు.

భూసేకరణ సకాలంలో పూర్తి చేయాలి

ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించి భూసేకరణ సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

లక్ష్యం మేరకు 'ఉపాధి' చేపట్టాలి

లక్ష్యం మేరకు ఉపాధి హామీ పనులు చేపట్టాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్వామా అధికారులు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పొలం గట్లలో చెట్లు నాటే కార్యక్రమాన్ని వారంలోపు పూర్తి చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా 577 పంచాయతీల్లో ఈనెల 23న గ్రామ సభలను పంచాయతీ కార్యదర్శి, సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

జిల్లాలో పర్యాటక అభివృద్ధికి చర్యలు

జిల్లాలో పర్యాటక అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతపురం, గుత్తి, కళ్యాణదుర్గం, తాడిపత్రి పరిధిలో ఆధ్యాత్మిక, హెరిటేజ్, న్యాచురల్ సర్క్యూట్‌లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డీఆర్‌డీఏ కార్యాలయం సంరక్షణ, చుక్కలూరు చెన్నకేశవస్వామి దేవాలయం, ఆలూరు కోన, చింతల వెంకటరమణ స్వామి దేవాలయం తదితర ప్రాంతాల వద్ద ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, మునిసిపల్ ఆర్‌డీ పీవీఎస్ఎన్ మూర్తి, ఆర్కియాలజీ ఏడీ రజిత, టూరిజం అధికారి జయకుమార్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ రమణారెడ్డి, కలెక్టరేట్ ఏఓ మారుతి తదితరులు పాల్గొన్నారు.

కప్పం కట్టమన్న టీడీపీ నాయకుల అరెస్టు



తహసీల్దార్ ఎదుట నిందితులను బైండోవర్ చేసిన దృశ్యం

అనంతపురం: తమకు కప్పం కట్టాలంటూ స్నేహ చికెన్ కంపెనీ ప్రతినిధిని బెదిరించిన టీడీపీ నాయకులు గణేష్ నాయుడు, రమణా రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ కే. సాయినాథ్ తెలిపిన మేరకు.. యల్లనూరు మండలం శింగవరం కొత్తపల్లికి చెందిన గణేష్ నాయుడు, రమణారెడ్డి వివిధ కంపెనీల నుంచి కోళ్లు తెచ్చి అనంతపురం, తాడిపత్రి పట్టణాల్లో రిటైల్‌గా చికెన్ షాపులకు విక్రయిస్తుంటారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన స్నేహ కోళ్ల కంపెనీ నుంచి కోళ్ల లోడును పద్మావతి ట్రేడర్ ద్వారా తీసుకునేవారు. అయితే, సరిగా డబ్బు చెల్లించని కారణంగా స్నేహ కంపెనీ వారు కోళ్లివ్వడం నిలిపివేశారు. దీంతో సదరు కంపెనీపై వీరు కోపం పెంచుకున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 4న ఇద్దరూ పూటుగా మద్యం సేవించారు. ఆ మత్తులో గణేష్‌నాయుడు స్నేహ చికెన్ కంపెనీ ఉద్యోగి సత్యాకు ఫోన్ చేశాడు. తాము టీడీపీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని, వచ్చి మేటర్ సెటిల్ చేసుకోవాలని, లేకపోతే స్నేహ చికెన్ కంపెనీ వాహనాలను జిల్లాలో తిరగనీయబోమని బెదిరించాడు. ఈ బెదిరింపుల ఆడియో ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ క్రమంలోనే స్నేహ చికెన్ కంపెనీ ప్రతినిధి సత్య అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు సోమవారం గణేష్ నాయుడుతో పాటు అతడిని ప్రోత్సహించిన రమణారెడ్డిని కూడా అదుపులోకి తీసుకున్నారు. తాను మద్యం మత్తులో ఫోన్ చేసి స్నేహ చికెన్ కంపెనీ ఉద్యోగి సత్యాను బెదిరించినట్లు నిందితుడు ఒప్పుకోవడంతో కేసు నమోదు చేశారు. ఇద్దరినీ అనంతపురం తహసీల్దార్ ముందు హాజరుపరచి బైండోవర్ చేయించారు.

రాఖీ.. శ్రీరామరక్ష పలికి..



జిల్లా జడ్జి శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



అనంతపురంలో సోదరుడికి రాఖీ కడుతున్న చెల్లెలు

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ వేడుకలను సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. చిన్నారులు మొదలు పెద్దల వరకు సోదరులకు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు పొందారు. పలువురు ప్రముఖులకు బ్రహ్మకుమారీలు రక్షాబంధనం కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి రాఖీ కడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకులు

వైద్యులకు రక్షణ కల్పించాలి





కోల్‌కతా ఘటనపై వైద్య విద్యార్థుల ప్రదర్శన, మంత్రికి వినతి పత్రం అందిస్తున్న జూడాలు

అనంతపురం మెడికల్: ప్రత్యేకంగా చట్టం తీసుకువచ్చి వైద్యులకు రక్షణ కల్పించాలని ఆప్ జూడా అధ్యక్షుడు డాక్టర్ హరికిరణ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం నగరంలో మంత్రి సత్యకుమార్‌ను కలిసి 13 డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హరికిరణ్ మాట్లాడుతూ అనంతపురం బోధనాస్పత్రి పరిసరాల్లో 24 గంటలూ పోలీసులుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా పెంచాలన్నారు. రాత్రి వేళ అపరిచిత వ్యక్తులు ఆస్పత్రుల్లోకి రాకుండా చూడాలన్నారు. వైద్యులు, సిబ్బందికి ఐడీ కార్డులను అందించాలన్నారు. వార్డుల్లోకి రోగుల సహాయకులు తక్కువ సంఖ్యలో వచ్చేలా చూడాలని, వైద్యులకు గదులు, వాష్ రూమ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో సిబ్బంది కోసం క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్నారు. హాస్టళ్లలో పునరుద్ధరణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

కన్నీళ్లు పెట్టించిన వైద్య విద్యార్థులు..

అంతకుముందు ఆప్ జూడా ఆధ్వర్యంలో సర్వజనాస్పత్రి నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోల్‌కతాలో పీజీ విద్యార్థినిపై జరిగిన హత్యాచారం, ఆ సమయంలో మృతురాలి ఆవేదనను వైద్య విద్యార్థులు ప్రదర్శన రూపంలో కళ్లకు కట్టారు. ఆద్యంతం ఉద్వేగంగా సాగిన ప్రదర్శన చూసి పలువురు వైద్య విద్యార్థులు, ప్రజలు భావోద్వేగానికి లోనై కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ వైద్య విద్యార్థులు కలెక్టర్ వినోద్ కుమార్‌కు విన్నవించారు. కార్యక్రమంలో డాక్టర్ నితిన్‌శర్మ, డాక్టర్ సాయినాథ్, డాక్టర్ విఘ్నేష్, డాక్టర్ నవీన్, డాక్టర్ ఆరిఫ్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ప్రణీత, జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్, మహిళా చైర్‌పర్సన్ సురేఖరావు, నాయకులు సోమశేఖర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ ఉద్యోగి ఆకస్మిక మృతి



గోవిందగౌడ్ (ఫైల్)

అనంతపురం మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారిగా పనిచేస్తున్న గోవిందగౌడ్ (62) ఆదివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి సోమవారం ఉదయం ఆయన నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. అంత్యక్రియలకు ప్రభుత్వం తరఫున రూ.25వేలు అందజేశారు. ఆరోగ్య శాఖలో 35 ఏళ్లుగా సేవలందిస్తున్న ఆయన ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట కార్యాలయ పరిపాలన అధికారి గిరిజామనోహర రావు, డెమో సిబ్బంది త్యాగరాజు, గంగాధర్ ఉన్నారు.

పట్టపగలే రూ.3 లక్షల అపహరణ



ఎర్రిస్వామితో వివరాలు ఆరా తీస్తున్న కానిస్టేబుల్

ఉరవకొండ: స్థానిక ఓ టైలర్ షాపులో ఉంచిన రూ.3 లక్షల నగదును ఓ దుండగుడు అపహరించుకెళ్లాడు. బాధితుడు ఎర్రిస్వామి తెలిపిన మేరకు... ఉరవకొండలోని సీఎస్ఐ చర్చి ఎదురుగా వంశీ టైలర్స్ పేరుతో ఎర్రిస్వామి దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం ఓ ప్లాట్ కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉంచుకున్న రూ.3 లక్షలను తీసుకుని వచ్చి దుకాణంలో పెట్టి, పనిపై బయటకు వెళ్లాడు. కాసేపటి తర్వాత దుకాణానికి చేరుకున్న ఎర్రిస్వామి... నగదు ఉంచిన కవర్ కోసం వెదకగా కనిపించక పోవడంతో కుమారుడు రాఘవేంద్రను ప్రశ్నించాడు. అయితే తనకేమీ తెలియదని, ఓ వ్యక్తి వచ్చి తన దుస్తులు ఆల్ట్రేషన్ చేయాలంటూ తెలిపాడని, అయితే పనిపై బయటకు వెళ్లిన తన తండ్రి వచ్చిన తర్వాత రావాలని తెలపడంతో ఆ వ్యక్తి వెళ్లిపోయాడని వివరించాడు. దీంతో ఫిర్యాదు అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు.

ఇంటి దొంగ పనే... : నగదు అపహరణ కేసులో సీఐ సురేష్‌బాబు లోతైన విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఎర్రిస్వామి కుమారుడు రాఘవేంద్ర ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో తమదైన శైలిలో విచారణ చేశారు. దీంతో వాస్తవం బయటపడింది. తనకు కొన్ని అప్పులు ఉన్నాయని, వాటిని తీర్చే మార్గం కానరాక ఆ డబ్బును తానే తీసి దాచేశానని అంగీకరించాడు. నేరం తనపై రాకుండా ఉండేందుకు ఓ కట్టుకథను అల్లినట్లు తెలిపాడు. దీంతో పోలీసులు తమ విచారణను కొనసాగిస్తున్నారు.

డబ్బిచ్చి తెస్తూ.. డబ్బా కొడుతూ

'మన భుజాలు మనమే తట్టుకుని శభాష్' అన్న చందంగా ఉంది జిల్లాలోని ప్రభుత్వ శాఖల తీరు. ఐఎస్ఓ సర్టిఫికేషన్ విషయంలో ఆయా శాఖల అధికారులు పాటిస్తున్న విధానాలు చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఏదైనా ప్రభుత్వ శాఖ పనితీరు ప్రజలకు నచ్చినప్పుడు, మెరుగైన సేవలు ఆ శాఖ నుంచి అందుకున్నప్పుడు కచ్చితంగా ప్రజలకే మెచ్చుకుంటారు. అదే ఆ శాఖకు గొప్ప సర్టిఫికెట్. కానీ, ఒక ప్రైవేటు సంస్థకు డబ్బు కట్టి సర్టిఫికెట్ తెచ్చుకుని సేవలు బాగున్నాయని చెప్పుకోవడమేంటో అర్థం కావడం లేదు.

- జిల్లాలో 21 ప్రభుత్వ శాఖలకు ఐఎస్ఓ సర్టిఫికెట్
- జారీ చేసిన ప్రైవేటు సంస్థ జీఎంసీఎస్
- రూ.50 వేల చొప్పున చెల్లించి పత్రం తెచ్చుకున్న ప్రభుత్వ శాఖలు
- సర్టిఫికెట్ వల్ల ప్రజలకు ఒరిగే ప్రయోజనం శూన్యం



ఐఎస్ఓ సర్టిఫికెట్ అందుకుంటున్న డీఆర్ఓ రామకృష్ణారెడ్డి (ఫైల్)

అనంతపురం అర్బన్: కొన్నిరోజులుగా జిల్లా యంత్రాంగం 'ఐఎస్ఓ' (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్) సర్టిఫికెట్ విషయంలో చేస్తున్న హడావుడి... ప్రచారం... ఇస్తున్న హైప్ అంతా ఇంతా కాదు. ఇదేదో కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖనో లేక రాష్ట్ర ప్రభుత్వమో ఇచ్చే సర్టిఫికెట్ కాదు. ఒక ప్రైవేటు సంస్థ (గ్లోబల్ మేనేజ్మెంట్ సర్టిఫికేషన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్- జీఎంసీఎస్) ఇచ్చేది. ఈ సర్టిఫికెట్ పొందడం ద్వారా ప్రభుత్వ శాఖలకు ఏమైనా ప్రయోజనం చేకూరుతుందా అంటే.. శూన్యమనే చెప్పవచ్చు. శాఖలు అందిస్తున్న సేవలను గుర్తించి ఆ సంస్థ సర్టిఫికెట్ ప్రదానం చేస్తోందా అంటే అదీ కాదు. సర్టిఫికెట్ కావాలనుకునే ప్రభుత్వ శాఖలు ఆ సంస్థ వద్ద రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. ఇందుకు అ సంస్థ కొన్ని సూచనలు చేస్తుంది. వాటిని పాటిస్తున్నట్లు చూపిస్తే చాలు ఐఎస్ఓ సర్టిఫికెట్ అందిస్తారు. ఇలా ఐఎస్ఓ సర్టిఫికెట్ ఇచ్చే ప్రైవేటు సంస్థలు చాలానే ఉన్నాయి. అందులో జీఎంసీఎస్ ఒకటి. ఒక అధికారి ప్రచార యావకు 'ఐఎస్ఓ' సర్టిఫికెట్ తంతు దర్పణం పడుతోందనే విమర్శలు వస్తున్నాయి.

21 శాఖలకు సర్టిఫికెట్..

జిల్లాలోని 21 ప్రభుత్వ శాఖలు డబ్బు చెల్లించి ఐఎస్ఓ సర్టిఫికెట్ తెచ్చుకున్నాయి. కలెక్టరేట్, ఆర్డీఓ గుంతకల్లు, ముఖ్యప్రణాళిక అధికారి కార్యాలయం, సర్వే భూరికార్డుల శాఖ, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం, అహుడా, పౌర సరఫరాల శాఖ, మహిళ శిశు సంక్షేమ శాఖ, వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల సంస్థ, కాలుష్య నియంత్రణ బోర్డు, ఉద్యాన శాఖ, నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్, ఆర్డీఓ అనంతపురం, ఉరవకొండ తహసీల్దారు కార్యాలయం, జిల్లా పరిశ్రమల శాఖ, ఔషధ నియంత్రణ శాఖ, ఆర్డీఓ కళ్యాణదుర్గం, ఎస్సీ కార్పొరేషన్, డీఆర్డీఏ, డ్వామా శాఖలు ఉన్నాయి. ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందాలనుకునే శాఖ లేదా సంస్థ రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.1,500 జీఎంసీఎస్ సంస్థకు చెల్లించాలి. అయితే సర్టిఫికెట్ కోసం ఆ సంస్థకు ఒక్కో జిల్లా శాఖ రూ.50 వేలు చెల్లించాయి. ఇలా 21 శాఖలు రూ.10.50 లక్షలు చెల్లించాయి. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1,500 కదా..? మరి రూ.50 వేలు ఎందుకు చెల్లించారని కొందరు జిల్లా అధికారులను అడిగితే.. ఐఎస్ఓ సర్టిఫికెట్ ఇచ్చే సంస్థ అందించిన సర్వీస్ కోసం అని సమాధానం వచ్చింది.

> **డబ్బులెవరివో..?**
>
> ఐఎస్ఓ సర్టిఫికెట్ కోసం చెల్లించిన రూ.50 వేలు ఎక్కడివి, ఎవరివి అనే విషయాన్ని చెల్లించిన అధికారులే చెప్పాలి. ఎందుకంటే ఆ మొత్తం వారెవరూ తమ వేతనం నుంచి లేదా తమ జేబు నుంచే ఇవ్వలేదని తెలిసింది. ఆయా శాఖల్లోని దిగువస్థాయి అధికారుల నుంచి వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలా డబ్బులు ఇచ్చిన అధికారులు.. తాము ఇచ్చిన మొత్తం "మరో మార్గం" ద్వారా రాబట్టుకుంటారనే విమర్శలు ఉద్యోగ వర్గాల నుంచే వినవస్తున్నాయి.

ప్రయోజనం శూన్యం..

డబ్బు చెల్లించి ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందిన ప్రభుత్వ శాఖకు దాని వలన ఒనగూరే ప్రయోజనం శూన్యం. ఈ విషయాన్ని కొందరు అధికారులే స్పష్టం చేస్తున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని చెప్పుకోవడానికి తప్ప మరెందుకూ పనికిరాదని చెబుతున్నారు. ఇక ప్రైవేటు సంస్థల విషయానికి వస్తే తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఐఎస్ఓ సర్టిఫికెట్ పనికిస్తుందనే అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



మృతుడు పెంచలయ్య

పెద్దవడుగూరు: నిల్చొన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా రామాపురం మండలం సరస్వతిపల్లికి చెందిన పెంచలయ్య (38)కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. లారీ డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకుంటున్న పెంచలయ్య... సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వైఎస్సార్ జిల్లా కడప నుంచి బళ్లారికి గ్యాస్ సిలిండర్ల లోడుతో బయలుదేరాడు. తెల్లవారుజామున పెద్దవడుగూరు మండలం వీరేపల్లి వద్ద అప్పటికే బ్రేక్‌డౌన్ కారణంగా రోడ్డుపై నిలబడిన లారీని వెనుక నుంచి ఢీకొనడంతో పెంచలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న వారు వెంటనే క్షతగాత్రుడిని వెలికి తీసి 108 అంబులెన్స్ ద్వారా గుత్తికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పెద్దవడుగూరు ఎస్ఐ చిన్నరెడ్డప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సచివాలయంలోకి రావొద్దంటూ టీడీపీ నేత హుకుం

శెట్టూరు: సచివాలయంలోకి రాకూడదంటూ వైఎస్సార్‌సీపీ వర్గీయులకు టీడీపీ నేత హుకుం జారీ చేశాడు. శెట్టూరు మండలం చింతర్లపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. సోమవారం ఉదయం స్థానిక వైఎస్సార్‌సీపీ నేత బాబు... సచివాలయానికి వెళ్లి డిజిటల్ అసిస్టెంట్ గాయత్రితో రేషన్ కార్డుల మంజూరుకు అవకాశం వస్తే తెలపాలని కోరారు. ఆ సమయంలో అక్కడే ఉన్న టీడీపీ నేత చెన్నకేశవ కల్పించుకుని.. 'వాడికి ఇక్కడ ఏమి పని? ఏ విషయమూ వాడికి చెప్పకండి' ఉద్యోగులపై రుబాబు చేశాడు. అంతటితో ఆగకుండా వైఎస్సార్‌సీపీకి చెందిన వారెవ్వరైనా సరే సచివాలయంలో కాలు పెడితే మర్యాదగా ఉండదంటూ దుర్భాషలాడుతూ బాబుపై దాడికి ప్రయత్నించాడు. ఉద్యోగులు అడ్డుకుని సర్దిచెప్పి బాబును బయటకు పంపారు. అనంతరం ఘటనపై పోలీసులకు బాబు ఫిర్యాదు చేశారు. సచివాలయంలో సేవల కోసం వచ్చిన వ్యక్తిని పార్టీ వేరంటూ సర్పంచ్ గౌరమ్మ కుమారుడు చెన్నకేశవ చేసిన దౌర్జన్యంపై సచివాలయ సిబ్బంది విస్తుపోయారు.

వైభవంగా రంగనాథుడి కల్యాణోత్సవం




ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో బొలికొండ రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏటా శ్రావణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ అర్చకులు సతీష్, పలుకూరి రవికుమార్, లిఖిల్, నవీన్, ఉదయ్, చేతన్... సోమవారం వేకువజామునే ఆలయంలో అభిషేకాలు, పూజలు, విశేష అలంకరణలు చేశారు. స్వామి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడి ఉత్సవ మూర్తులకు అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఈఓ నాగేంద్రుడు, సర్పంచ్ సుహాసిని, సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ఉన్నతమైన గుర్తింపు

- అంగన్‌వాడీ కార్యకర్త నిర్మలమ్మను సన్మానించిన కలెక్టర్



నిర్మలమ్మను సన్మానిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (చిత్రంలో) అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం అర్బన్: ఉత్తమ సేవలకు ఉన్నతమైన గుర్తింపు లభిస్తుందనేందుకు అంగన్‌వాడీ కార్యకర్త నిర్మలమ్మ జీవితమే నిదర్శనమని కలెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. దేశ స్థాయిలో జిల్లాకు ఖ్యాతి తీసుకొచ్చిన ఆమె సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న ఢిల్లీలో జరిగిన ఉత్సవాలకు ప్రత్యేక ఆహ్వానితురాలిగా నిర్మలమ్మ హాజరైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్కడి వేడుకల అనంతరం జిల్లాకు వచ్చిన నిర్మలమ్మను సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

రేషన్ దుకాణం సీజ్

యల్లనూరు: బఫర్ స్టాక్‌లో పేర్కొన్న దాని కంటే 85 కిలోల రేషన్ బియ్యం తక్కువగా ఉన్న యల్లనూరు మండలం మల్లాగుండ్లలోని 18వ చౌక దుకాణాన్ని అధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు తహసీల్దారు నాగారాజు తెలిపారు. రీజనల్ విజిలెన్స్ ఎస్ఐ ఫణీంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో మల్లాగుండ్లలోని పలు చౌకదుకాణాలను అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో డీలర్ పెద్దిరెడ్డికి చెందిన చౌక దుకాణంలో 85 కిలోల బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించి సీజ్ చేసి, అందులో ఉన్న స్టాక్‌ను వీఆర్వో షబానాకు అప్పగించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శ్వేత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం



మృతుడు సత్యనారాయణరెడ్డి



బోల్తాపడిన ఐచర్ వాహనం

శింగనమల/పామిడి: ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడి మండలం కండ్లపల్లికి చెందిన గంధవీటి సత్యనారాయణరెడ్డి(50), తన దాయాది లక్ష్మీకాంత్‌రెడ్డితో కలసి ద్విచక్ర వాహనం మీద సోమవారం అనంతపురానికి వెళ్లాడు. మధ్యాహ్నం పని ముగించుకుని తిరుగు ప్రయాణమైన వారు శింగనమల మండలం లోలూరు క్రాస్ వద్దకు చేరుకోగానే వర్షం పడుతుండడంతో కాసేపు ఆగారు. అనంతరం 44వ జాతీయ రహదారిపై వెళుతుండగా ద్విచక్ర వాహనం వెనుకనే వేగంగా దూసుకొచ్చిన ఐచర్ వాహనం ఢీకొని, రోడ్డు పక్కన వల్లంలో బోల్తాపడింది. ఘటనలో సత్యనారాయణరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీకాంతరెడ్డిని 108 అంబులెన్స్ ద్వారా సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై శింగనమల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కండ్లపల్లిలో విషాదఛాయలు

సత్యనారాయణరెడ్డి మృతి విషయం తెలియగానే కండ్లపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య ఉష, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదంలో గాయపడి అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీకాంతరెడ్డి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. వైఎస్సార్‌సీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న సత్యనారాయణరెడ్డి మృతిపై ఆ పార్టీ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు.

ఓఎంసీలో స్క్రాప్ దొంగల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రాయదుర్గం: ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ)లో సీబీఐ సీజ్ చేసిన వాహనాల్లోని సామగ్రి (స్క్రాప్) అపహరించుకెళ్లిన దొంగలను ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ కేసుతో సంబంధం ఉన్న మరి కొందరిని సోమవారం అరెస్ట్ చేశారు. స్థానిక రూరల్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ వెంకటరమణ, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. గత శుక్రవారం ఓఎంసీలోకి చొరబడిన ముఠా సభ్యులు సీబీఐ సీజ్ చేసిన హిటాచీ, జేసీబీని గ్యాస్ కట్టర్ల సాయంతో విడదీసి, రూ.13.48 లక్షల విలువైన స్క్రాప్‌ను ఎత్తుకెళ్లే సమయంలో ఎస్ఐ, సిబ్బంది అక్కడకు చేరుకుని కొందరిని అరెస్ట్ చేశారు. ఆ సమయంలో తప్పించుకుని పారిపోయిన డి.హీరేహాళ్ మండలం సిద్దాపురం నివాసి భాస్కర్, బళ్లారికి చెందిన ఖలీద్, తౌసిఫ్, ఉలిగప్ప, రియాజ్ అహమ్మద్, మహమ్మద్ బషీర్, రేణుకప్ప, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆసిఫ్ ఖాన్, అమన్, రవూఫ్ ఖాన్‌ను సోమవారం అరెస్ట్ చేసి, చోరీకి ఉపయోగించిన పరికరాలను, బొలెరో వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

దందాలోకి డాన్!

- జిల్లాలో బియ్యం దందాపై బనగానపల్లి డాన్ దృష్టి
- అధికార పార్టీ నేతల సహకారం కోసం ప్రయత్నాలు

అనంతపురం క్రైం: కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలోని టీడీపీ నేతలు అక్రమ సంపాదనకు అర్రులు చాస్తున్నారు. అప్పనంగా ఆదాయం వచ్చే మార్గాలన్నీ అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలోనే వారి దృష్టి రేషన్ బియ్యం దందాపై పడింది. అధికార పార్టీ నేతల ఆలోచనను పసిగట్టిన నంద్యాల జిల్లా బనగానపల్లికి చెందిన 'బియ్యం డాన్' జిల్లాలోనూ దందా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. గతంలో జిల్లాకే చెందిన ఓ వ్యాపారి చౌకధాన్యపు డిపోల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని పాలిష్ పట్టి.. రాష్ట్ర సరిహద్దులు దాటించి రూ.కోట్లు గడించాడు. అతను ప్రస్తుతం జిల్లాను వీడి ఎక్కడో తల దాచుకుంటున్నాడు. జిల్లాలో అంత పెద్దస్థాయిలో దందా చేసే మరొక వ్యక్తి అధికార పార్టీ నేతలకు తారసపడలేదు. దీంతో వారు బనగానపల్లికి చెందిన డాన్ చేతిలో బియ్యం అక్రమ వ్యాపారాన్ని పెట్టాలని చూస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే అతను అధికార పార్టీ నేతలతో మాట్లాడేందుకు ఇప్పటికే రెండు సార్లు జిల్లాకు వచ్చి వెళ్లినట్లు తెలుస్తోంది. ఇదిలావుండగా.. అనంతపురంలో బియ్యం వ్యవహారం ఎమ్మెల్యే దగ్గుపాటి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి మధ్య వార్‌కు తెర లేపింది. బియ్యం దొంగ నువ్వంటే నువ్వేనంటూ పరస్పరం నిందించుకునే స్థాయిలో వార్ నడుస్తోంది. చివరకు పోలీసు ఫిర్యాదుల వరకూ వెళ్లారు. మిగిలిన నియోజక వర్గాల్లోనూ చౌక బియ్యం పెద్దఎత్తున పట్టుబడుతోంది. ముఖ్యంగా కర్ణాటక సరిహద్దు నియోజకవర్గాల్లో అధికార పార్టీ నేతలే దందా చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలోనే బనగానపల్లి డాన్ పేరు కూడా తెరపైకి రావడంతో బియ్యం దందానే అధికార పార్టీ నేతలు ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

రీల్ చేయండి.. రూ.లక్ష గెలుచుకోండి

- ఔత్సాహికులకు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ బంపర్ ఆఫర్



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: సామాజిక మాధ్యమాల్లో ఉత్సాహంగా ఉండే యువతకు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ బంపర్ ఆఫర్ ఇచ్చారు. సినిమా మాటలు, డైలాగ్‌లతో రీల్స్ చేసే వారు...జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, మన సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించే రీల్స్ చేస్తే నగదు ప్రోత్సాహకం అందజేస్తామన్నారు. ఆకర్షణీయమైన రీల్స్, వీడియోలు రూపొందించిన వారిలో ముగ్గురిని ఎంపిక చేస్తామని, మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేలు, మూడో బహుమతిగా రూ.25 వేల చొప్పున అందిస్తామన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక శాఖ ప్రదేశాలు, వారసత్వం, సంస్కృతిపై త్వరలో నిర్వహించనున్న థీంకు సంబంధించి పర్యాటక శాఖ రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. వీడియోలు, రీల్స్‌ను పోస్టర్‌పై ఇచ్చిన క్యూఆర్ కోడ్ ద్వారా సెప్టెంబర్ 5వ తేదీలోపు పంపాలన్నారు. విజేతలకు ప్రపంచ పర్యాటక దినోత్సవం సెప్టెంబర్ 27వ తేదీన ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పర్యాటక శాఖ సిబ్బంది ప్రతాప్‌రెడ్డి పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

హోటల్లో పేలిన గ్యాస్ సిలిండర్



హోటల్లో చెలరేగుతున్న మంటలు

గుత్తి: స్థానిక వాసవీ బజారులో ఉన్న సత్య హోటల్లో వంట గ్యాస్ సిలిండర్ పేలింది. సోమవారం తెల్లవారు జామున 4.30 గంటలకు వంట మాస్టర్ రంగయ్య హోటల్ తలుపు తెరిచి స్టవ్‌లు వెలిగించే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ప్రమాదాన్ని పసిగట్టిన రంగయ్య వెంటనే బయటకు పరుగు తీస్తుండగా మంటలు వ్యాపించి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది గుంతకల్లు నుంచి వచ్చే మంటలు ఆర్పేలోపు హోటల్‌లో ఉన్న విలువైన సామగ్రి మొత్తం కాలి బూడిదైంది. హోటల్ నిర్వాహకుడు సత్య మాట్లాడుతూ.... దాదాపు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు వివరించాడు. తనను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

మార్కెటింగ్ సేవలు విస్తృతం చేయాలి

- అగ్రి మార్కెటింగ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ విజయసునీతను కోరిన కలెక్టర్ వినోద్‌కుమార్



విజయసునీతకు పూల మొక్క అందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, రైతు బజార్ సేవలు విస్తృతం చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అగ్రి మార్కెటింగ్ డైరెక్టర్, రైతు బజార్ సీఈఓ ఎం.విజయసునీతను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె... సోమవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పూల మొక్కను అందించి కలెక్టర్ స్వాగతించారు. అనంతరం జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, రైతు బజార్ అంశాలపై చర్చించారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి చర్యలు

అనంతపురం సెంట్రల్: అనంతపురం మార్కెట్ యార్డు అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్, రైతు బజార్ సీఈఓ ఎం.విజయసునీత ఆదేశించారు. సోమవారం మార్కెట్ యార్డును ఆమె పరిశీలించారు. సాధించిన ప్రగతిపై ఏడీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. యార్డులో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలన్నారు. అసంపూర్తిగా నిలిచిన పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. యార్డులో నెలకొన్న పలు సమస్యలను ఈ సందర్భంగా ఆమె దృష్టికి స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, పలువురు అధికారులు తీసుకెళ్లారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి, ఆర్‌జేడీ రామాంజనేయులు, ఎస్ఈ వెంకటేశ్వర్లు, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



సురేష్‌బాబు (ఫైల్)

వజ్రకరూరు: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... వజ్రకరూరు మండలం వెంకటాంపల్లికి చెందిన కాటిగాని సురేష్‌బాబు (35) తనకున్న 8 ఎకరాల్లో వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దమిరప పంటలో కలుపు తీస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అటుగా వెళుతున్న వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బాధితుడిని ఆటోలో గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సురేష్‌బాబు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య సుప్రజ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉన్న సురేష్‌బాబును పరిశీలించి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

నీటి పొదుపు పాటించాలి



అనంతపురం సెంట్రల్: నీటి పొదుపు పాటించాలని ప్రజలకు కలెక్టర్ వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి ఈ ఏడాది 26.368 టీఎంసీలు దామాషా ప్రకారం కేటాయించారన్నారు. ఇందులో తాగునీటికి 10 టీఎంసీలు పోనూ మిగిలిన 16.368 టీఎంసీలు ఆయకట్టుకు విడుదల చేయనున్నట్లు వివరించారు. హైలెవల్ మెయిన్ కెనాల్ (హెచ్ఎల్ఎంసీ), గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ కింద తాగునీటి పథకాలు, రైతుల కోసం నారు మడులకు నెల 10వ తేదీ నుంచి విడుదల చేస్తున్నట్లు వివరించారు. త్వరలో జరిగే సాగునీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశంలో మిడ్ పెన్నార్ సౌత్, నార్త్ కెనాల్స్ ఆయకట్టుకు నీరు విడుదలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ప్రతిపాదిత పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని, నీటి పొదుపు దృష్టి సారించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



కలెక్టర్ వినోద్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం అర్బన్: కలెక్టర్ వి.వినోద్ కుమార్‌ను నూతనంగా నియమితులైన ఎస్పీ పి.జగదీష్ సోమవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, జిల్లా పరిస్థితులపై కొద్దిసేపు చర్చించారు.

నేడు సంగీత విభావరి

అనంతపురం కల్చరల్: నగరంలోని అనంతపురం క్లబ్‌లో మంగళవారం సాయంత్రం పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సురేష్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆత్మీయ అతిథులుగా విచ్చేస్తారని కళాభిమానులందరూ తరలిరావాలన్నారు.

15 ఫిర్యాదుల స్వీకరణ

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం అదనపు కమిషనర్ శ్రీహరి బాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. టౌన్ ప్లానింగ్ విభాగం 7, ప్రజారోగ్య విభాగం 5, ఇంజినీరింగ్ 3 చొప్పున మొత్తం 15 ఫిర్యాదులు వచ్చాయి.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి



సమస్య విన్నవించేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన దివ్యాంగులు

అనంతపురం అర్బన్: బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని దివ్యాంగులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన దివ్యాంగులు శ్రీనివాసులు, దేవదాసు, నారాయణమ్మ, టి.భాగ్యలక్ష్మి, జి.భాగ్య, ఎస్.అపర్ణ, తదితరులు తమ సమస్యను వివరించారు. దివ్యాంగులకు సంబంధించి 29 బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడంతో దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మెరిట్ జాబితా అనంతరం తాము మెడికల్ టెస్ట్‌కు కూడా వెళ్లి వచ్చామని తెలిపారు. అయితే ఖాళీల భర్తీ విషయంలో జాప్యం జరుగుతోందన్నారు. నాలుగు నెలలుగా తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

అటానమస్ కళాశాలల పాత్ర కీలకం

అనంతపురం: వర్సిటీ పురోగతిలో అటానమస్ కళాశాలల పాత్ర కీలకమని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు అన్నారు. సోమవారం జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని అటానమస్ కళాశాలల ప్రతినిధులు జేఎన్‌టీయూ అనంతపురం ఇంచార్జి వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, ఓఎస్డీటూ వీసీ ప్రొఫెసర్ ఓ దేవన్న, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్యలను ఘనంగా సత్కరించారు. అటానమస్ కళాశాలల సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

భూసారంపై అవగాహన తప్పనిసరి



భూసార పరీక్షా కేంద్రానికి వచ్చిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

అనంతపురం సెంట్రల్: భూసారంపై అవగాహన ఉన్నప్పుడే అధిక దిగుబడులు సాధించడానికి వీలవుతుందని వ్యవసాయశాఖ (భూసార పరీక్ష కేంద్రం) ఏడీ పుష్పలత సూచించారు. సోమవారం ఆర్ట్స్ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమెస్ట్రీ చదువుతున్న విద్యార్థులకు భూసార పరీక్షల వలన ఉపయోగాలు, సూక్ష్మ పోషకాలపై అవగాహన కల్పించారు. రైతులు విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వాడకుండా, భూసారం పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకునే విధంగా చైతన్య పర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల లెక్చరర్లు రాజశేఖరరెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్థమయ్యేలా బోధించండి

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా సరళరీతిలో బోధించాలని ఎంఈఓ-1 మున్వర్ బాషా, ఎంఈఓ-2 ప్రసూన్ కుమార్ నాయుడు ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని న్యామద్దెల కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాల ఉపాధ్యాయులకు న్యామద్దెల ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. సబ్జెక్టుపై ఏకాగ్రత కలిగే విధంగా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. ముఖ్యంగా ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో సందేహాలను నివృత్తి చేయాలన్నారు.

బాల్యంపై భారం

- నర్సరీ, ఎల్కేజీల్లో పుస్తకాల మోత
- వయస్సుకు మించిన భారంతో
- ఎదుగుదలకు ఆటంకం
  ఆరోగ్య సమస్యలు వస్తాయంటున్న వైద్యులు



రాప్తాడులో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

రాప్తాడు: ఆడుతూ పాడుతూ గడపాల్సిన బాల్యం పుస్తకాల మోతతో బరువెక్కుతోంది. ఏటా పై తరగతికి వెళ్తుంటే.. పుస్తకాల సంఖ్య కూడా దానికి తగ్గట్టుగానే పెరుగుతోంది. ప్రైవేట్ స్కూళ్లలో అయితే పుస్తకాలను మోస్తూ సతమతవుతున్నారు. బ్యాగునిండా పుస్తకాలతో రెండు, మూడు అంతస్తుల మెట్లు ఎక్కేందుకు అవస్థలు పడుతున్నారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు స్కూలు బ్యాగులు మోయకూడదు. మిగిలిన తరగతులకు సంబంధించి విద్యార్థి శరీర బరువులో పదో వంతు ఉండాలని చిల్డ్రన్స్ స్కూల్ బ్యాగ్ యాక్ట్-2006 చెబుతోంది. ప్రతి పాఠశాలలో ఆ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల పుస్తకాలకు లాకర్లు ఏర్పాటు చేయాలి. ఏ రోజు పుస్తకాలు ఆరోజు ఇవ్వాలని తల్లిదండ్రులకు మార్గదర్శకాలు ఇవ్వాలి. ఇలాంటి సౌకర్యాలు కల్పించకపోయినా.. నిబంధనలు పాటించకపోయినా పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు విధిగా ప్రభుత్వం ముద్రించిన పాఠ్యపుస్తకాలతోనే విద్యార్థులకు పాఠాలు బోధించాలి. స్టేట్, సీబీఎస్ఈ సిలబస్ మినహా మరే ఇతర పాఠ్యాంశాలను బోధించరాదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఐఐటీ కోచింగ్, స్మార్ట్ క్లాసుల పేరుతో ప్రైవేటు ముద్రణ సంస్థల నుంచి పుస్తకాలను కొనుగోలు చేయాల్సిందిగా తల్లిదండ్రులకు సూచిస్తున్నారు.

35 వేల మంది విద్యాభ్యాసం..

రాప్తాడు నియోజకవర్గంలో రాప్తాడు, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి, రామగిరి, అనంతపురం రూరల్ మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు దాదాపుగా 298 ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో దాదాపుగా 35 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు ఆరు పాఠ్య పుస్తకాలు, మరో ఆరు నోట్ బుక్స్, కాపీ రైట్‌కు సంబంధించి నాలుగు పుస్తకాలు ఉంటాయి. ప్రైవేటు పాఠశాలలు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. తల్లిదండ్రులపై ఫీజులు, విద్యార్థులపై పుస్తకాల భారం మోపుతున్నాయి. ఒకటో తరగతి చదివే విద్యార్థికి సాధారణంగా 12 నుంచి 14 పుస్తకాలు ఉండాలి. కానీ 32 నుంచి 34 పుస్తకాలు ఉంటున్నాయి. ప్రింటెడ్ కాపీరైట్ ప్రింటెడ్ కలర్ కాంపోజింగ్, హోం, స్కూల్ ఎక్సర్ సైజు, రైటింగ్ ఇంప్రూమెంట్, లాంగ్వేజ్ డిక్షనరీ, డ్రాయింగ్ తదితర పుస్తకాలు అదనంగా జోడిస్తున్నారు. అవసరమైన పుస్తకాలు మోస్తున్న చిన్నారుల వెన్నముకపై తీవ్ర ప్రభావం పడి ఎదుగుదల లోపించే ప్రమాదం ఉంది.

వైద్య నిపుణుల సూచనలు

- పిల్లల్లో సాధారణంగా 15 ఏళ్లలోపే శరీరంలో వివిధ మార్పులు చోటు చేసుకుంటాయి. పాఠశాల వయసులో మోయాల్సిన భారం కంటే అధిక బరువు మోయడంతో వెన్నుముఖ సమస్యలు తలెత్తుతాయి.
- ఎక్కువ పుస్తకాలు ఉన్న పక్షంలో ఉపాధ్యాయుల సలహా మేరకు ఏ రోజు అవసరమైన పుస్తకాలు ఆ రోజు తీసుకెళ్లేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.
- బ్యాగును రెండు భుజాలపై సమాన బరువుతో తగిలించుకోవాలి. ఒక వైపు తగిలించుకుంటే భుజం, మెడ నొప్పి వస్తుంది.
- నిత్యం వ్యాయామం చేయడం వల్ల శారీరక పరమైన ఇబ్బందులు అధిగమించవచ్చు.
- విద్యార్థి బరువులో పుస్తకాల బరువు మూడవ వంతు మించరాదు. ఉదాహరణకు 20 కిలో బరువు ఉన్న విద్యార్థి మూడు కిలోల పుస్తకాలు మాత్రమే మోయాలి.


పుస్తకాల బరువు తగ్గించాలి



చదువు విద్యార్థిలో చైతన్యం తీసుకురావాలి. విజ్ఞానంపై వారిలో ఆసక్తిని పెంచాలి. కానీ నేటి చదువులకు తీసుకెళ్లే పుస్తకాలు విద్యార్థులకు భారంగా మారుతున్నాయని ఎన్నో అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దీనిపై తల్లిదండ్రులు, విద్యా సంస్థల యాజమాన్యాలు, ప్రభుత్వాలు కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పుస్తకాల బరువు కారణంగా చిన్నతనంలోనే మానసిక బలహీనత బారిన పడే ప్రమాదముంది. ఈ బరువులు ఇలానే మోస్తే భవిష్యత్‌లో వారిని వెన్నపూస, నడుము, కండరాల నొప్పులు బాధిస్తాయి. విద్యార్థి ఆనందంగా, ఆరోగ్యంగా విద్యాభ్యాసం చేయాలంటే వారు మోసుకెళ్లే పుస్తకాల బ్యాగు బరువు తగ్గించాల్సి ఉంది.

– శివకృష్ణ, వైద్యాధికారి, రాప్తాడు

కనుల పండువగా బలరామ జయంతి



అలంకరణలో రాధా పార్థసారథులు

అనంతపురం కల్చరల్: కృష్ణాష్టమి వేడుకలకు ముందొచ్చే బలరామ జయంతి వేడుకలు సోమవారం ఇస్కాన్ మందిరంలో కనులపండువగా జరిగాయి. జిల్లా ఇన్‌చార్జి దామోదర గౌరంగదాసు నేతృత్వంలో జరిగిన జయంత్యుత్సవంలో అధిక సంఖ్యలో కృష్ణభక్తులు ఉత్సాహంతో భజన గీతాలాలపించారు. రాధా పార్థసారథుల విగ్రహాలను వివిధ రకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. హరేకృష్ణ నామస్మరణతో మందిరం ప్రతిధ్వనించింది. ఆధ్యాత్మిక ఉపన్యాసంలో దామోదర ప్రభు బలరామ జయంతి విశిష్టతను తెలియజేశారు. జగతిలో అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా బలరామకృష్ణులు ఆదర్శపురుషులుగా నిలిచారన్నారు. అనాదిగా వస్తున్న మైత్రీ బంధానికి గుర్తుగా సాగే వేడుకలు అందరిలో ప్రశాంతతను నింపుతాయని తెలిపారు. అనంతరం మహామంగళ హారతి, పుష్పాభిషేకం, తీర్థప్రసాద వితరణ జరిగాయి.

ఏఎన్ఎంలను ఆరోగ్యశాఖకు కేటాయించాలి



డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం మెడికల్: జిల్లాలోని వివిధ సచివాయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్ఎంలను ఆరోగ్యశాఖకు కేటాయించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబను కలిసి వినతిపత్రం సమర్పించారు. కూటమి ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కార్యదర్శులను వారి మాతృ శాఖలకు బదలాయించిందన్నారు. కానీ సచివాయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్ఎంలను ఆరోగ్యశాఖకు కేటాయించలేదని గుర్తు చేశారు. స్పందించిన డీఎంహెచ్ఓ.. సమస్యను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాజారెడ్డి, రాజేష్, కృష్ణుడు, రజిని, యాస్మిన్ భాను, లక్ష్మి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటింటా ఓటరు సర్వే



కనగానపల్లి: బీఎల్ఓలకు సూచనలిస్తున్న తహసీల్దార్ రమాదేవి



రాప్తాడు: మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమారి

కనగానపల్లి: 2025లో జరిగే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఓటరు సర్వేను పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ రమాదేవి బీఎల్ఓలను ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓ, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా చేపట్టే ఓటరు సర్వేపై బీఎల్ఓలకు పలు సూచనలు అందించారు. ఓటరు జాబితాలను సక్రమంగా పరిశీలించి తప్పుఒప్పులను సరిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు వీఆర్వోలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

రాప్తాడు: ఇంటింటా ఓటరు సర్వేను పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ విజయకుమారి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 20 నుంచి ఇంటింటా ఓటరు సర్వే చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులతో పాటు ఇప్పటి వరకు ఓటు హక్కు పొందని వారికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సేకరించి ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

తూముచెర్ల రోడ్డు బాగు చేయిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

కనగానపల్లి: గుంతలమయంగా ఉన్న తూముచెర్ల-అనంతపురం రహదారికి వెంటనే మట్టి వేయించి రోడ్డును బాగు చేయిస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. మండలంలోని తూముచెర్ల నుంచి రంగంపేట మీదుగా అనంతపురం వెళ్లే రహదారి దుస్థితిపై సోమవారం సాక్షిలో రహదారి ఇలా.. ప్రయాణం ఎలా? అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వ అధికారులతో కలసి సోమవారం మధ్యాహ్నం తూముచెర్ల గ్రామానికి వెళ్లి రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు, వాహనదారులతో మాట్లాడి రహదారి దుస్థితిపై ఆరా తీశారు. వర్షాకాలంలో ఈ రహదారి గుండా వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే మట్టి పనులు చేపట్టి రహదారిపై పడిన గుంతలను పూడ్పించాలని పంచాయతీరాజ్ ఇంజినీర్లను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి తారురోడ్డు నిర్మాణ పనులకు అంచనాలు తయారు చేయించాలని సూచించారు. పంచాయతీరాజ్ డీఈ రామచంద్రారెడ్డి, జేఈ నారాయణ స్వామి, మండల టీడీపీ నాయకులు కన్వీనర్ పోతలయ్య, నెట్టం వెంకటేష్, తూంచర్ల హరి, అంకె వన్నూరప్ప, పాల్గొన్నారు.



దెబ్బతిన్న రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

25న జిల్లా స్థాయి యోగా పోటీలు

అనంతపురం కల్చరల్: స్థానిక షిర్డీ నగర్‌లోని వివేకానంద భవన్‌లో ఈనెల 25న జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి తెలిపారు. సోమవారం వివేకానంద భవన్‌లో జరిగిన సమావేశంలో అసోసియేషన్ పాట్రన్ రవికాంత్‌రమణ, కార్యదర్శి మారుతీ ప్రసాద్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్లకు ట్రెడిషనల్ యోగా, ఆర్టిస్ట్ సోలో, ఆర్టిస్టు పెయిర్, రిథమిక్ పెయిర్ తదితర విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 45 ఏళ్లు పైబడిన వారికి కేవలం ట్రెడిషనల్ యోగా విభాగంలో మాత్రమే పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు, వయస్సుతో సంబంధం లేకుండా అందరూ యోగా పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు తారక్ 9393938447, దివాకర్ 9963028694 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ఇంటిగ్రేటెడ్ కోర్సుల అమలు



బ్లెకింగ్ వర్సిటీ అడ్మిషన్ల ప్రక్రియలో పాల్గొన్న జేఎన్‌టీయూ వీసీ హెచ్.సుదర్శనరావు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం, బ్లెకింగ్ వర్సిటీ (స్వీడన్) సంయుక్తంగా ఇంటిగ్రేటెడ్ కోర్సులను అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా బీటెక్ కోర్సు మూడు సంవత్సరాలు జేఎన్‌టీయూ అనంతపురంలో, చివరి సంవత్సరం స్వీడన్‌లో పూర్తి చేయాల్సి ఉంటుంది. బీటెక్ డిగ్రీని జేఎన్‌టీయూను, బీఎస్ పట్టాను బ్లెకింగ్ వర్సిటీ ప్రదానం చేస్తుంది. అనంతరం ఎంఎస్ ప్రోగ్రాంను బ్లెకింగ్ వర్సిటీ, స్వీడన్‌లో చేయవచ్చు. ఈ కోర్సుల్లో సోమవారం ఇద్దరు విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. వారికి అడ్మిషన్ పత్రాలను జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, ఓఎస్డీటూ వీసీ ప్రొఫెసర్ ఓ దేవన్న తదితరులు అందజేశారు.

మహిళలపై దాడులు అరికట్టాలి



మాట్లాడుతున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత

అనంతపురం: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత పేర్కొన్నారు. సోమవారం ఎస్కేయూ క్యాంపస్‌లో ఆల్‌ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకున్నాం. కానీ నానాటికీ మహిళలపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తోందన్నారు. విద్యార్థినులు ధైర్యంగా, స్వీయ రక్షణలో విద్యాభ్యాసం చేసేలా ధైర్యసాహసాలు ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.కృష్ణకుమారి, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పౌర్ణమి



ఘనంగా సాగిన సత్యదేవుని వ్రతం



బ్రాహ్మణ వసతి గృహంలో ఉపాకర్మ వేడుకలు



పూజలందుకున్న కాశీవిశ్వేశ్వరుడు

అనంతపురం కల్చరల్: అజ్ఞాన తిమిరాంధకారాన్ని తొలగించే శ్రావణ పౌర్ణమి వేడుకలు సోమవారం పలు ఆలయాల్లో ఘనంగా జరిగాయి. హయగ్రీవ జయంతి, జంధ్యాల పౌర్ణిమ వేడుకలు కూడా కలిసి రావడంతో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, సత్యదేవుని వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొదటి రోడ్డులోని రాఘవేంద్ర స్వామి మఠం, అశోక్ నగర్‌లోని శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి ఆలయం, వివిధ బాబా మందిరాల్లో సామూహిక వ్రతాలు చేపట్టారు. తపోవనంలోని శ్రీక్షేత్రంలో హయగ్రీవుడికి అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహించారు. భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం పలుచోట్ల అన్నప్రసాద వితరణ జరిగింది. మూడవ రోడ్డులోని బ్రాహ్మణ విద్యార్థి వసతి గృహంలో ఉపాకర్మ వేడుకలు జరుపుకున్నారు. వేద పండితులు శాస్త్రోక్తంగా జంధ్యాలను మార్పించారు.

ఆత్మీయతకు ప్రతీక రక్షా బంధన్



మేయర్ వసీంకు రాఖీ కడుతున్న డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య



జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి



మంత్రి సత్యకుమార్‌కు రాఖీ కడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి

అనంతపురం కల్చరల్: రాఖీ పౌర్ణమిని జిల్లా వాసులు ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ప్రతి ఇంటా రక్షాబంధన్ సందడి నెలకొంది. అన్నలు, తమ్ముళ్లకు అన్నింటా విజయం చేకూరాలని అక్కచెల్లెమ్మలు రాఖీలు కట్టారు. స్వీట్లు తినిపించారు. పలు సంఘ శాఖల్లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమి వేడుకలు వినూత్న రీతిలో సాగాయి. కార్యక్రమానికి హాజరైన శిక్షకులు 'నీవు నాకు రక్ష.. నేను నీకు రక్ష.. మనిద్దరం దేశానికి రక్ష..' అంటూ ప్రతి ఒక్కరికీ రక్షాబంధనం గావించారు. అదే విధంగా అధికార అనధికార ప్రముఖులకు వివిధ స్వచ్ఛంధ సేవా సంస్థలు రాఖీలు కట్టి అనుబంధాన్ని చాటుకున్నారు. ఈశ్వరీయ విశ్వవిద్యాలయ బ్రహ్మకుమారీలు జిల్లా జడ్జి శ్రీనివాసులు, జేఎన్‌టీయూ వీసీ సుదర్శరావుతో పాటూ నగరంలోని పలువురు అధికారులకు రాఖీలు కట్టారు.

మాజీ ఎమ్మెల్యే అనంతకు రాఖీ కట్టిన నాయకురాళ్లు..

అనంతపురం కార్పొరేషన్/అనంతపురం మెడికల్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నాయకురాళ్లు మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి ఆయన నివాసంలో రాఖీ కట్టారు. స్వీట్లు తినిపించి, రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. అక్కా, చెల్లెళ్లకు దేవుడి దీవెనలు అని వేళలా ఉండాలన్నారు. ఈ మధ్య కాలంలో మహిళలపై అఘాయిత్యాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో రాజీవ్ కాలనీ సర్పంచ్ ఆశాబీ, ఎంపీటీసీ సంధ్య, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకురాలు షేక్ మునీరా, నాయకురాళ్లు శోభారాణి, శోభాబాయి, సుజాత, శాంతి, భారతి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు. మేయర్ వసీంకు ఆయన క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, బ్రహ్మకుమారీలు రాఖీ కట్టారు. మేయర్ వసీం వారికి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆత్మకూరు/రాప్తాడు: ఆత్మకూరు, రాప్తాడులో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అక్కా, చెల్లెళ్లు తమ అన్న, తమ్ముళ్లకు రాఖీలు కట్టి హారతులు ఇచ్చారు. స్వీట్ తినిపించి, రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ కట్టినందుకు తోబుట్టువులకు కానుకలు అందించారు. రాప్తాడు మండల వ్యాప్తంగా పలు ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. పండమేటి వెంకటరమణ స్వామి ఆలయంతో పాటు నిలకంఠేశ్వర స్వామి, ఆంజనేయస్వామి దేవాలయం, మండల పరిధిలోని మరూరులో చిన్నకదిరయ్యస్వామి, పుల్లలరేవు, యర్రగుంట చెన్నకేశవస్వామి, హంపాపురంలో మౌనగిరి క్షేత్రంలో 39 అడుగుల ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

కంప్యూటర్, క్రాఫ్ట్ కోర్సుల దరఖాస్తుకు నేటితో ఆఖరు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆఫీస్ ఆటోమేషన్, పీసీ మెయింటెనెన్స్, ట్రబుల్ షూటింగ్, ఆటోకాడ్ తదితర కంప్యూటర్ కోర్సులతో పాటు యోగా, బ్యూటీషియన్ క్రాఫ్ట్ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు నేటితో (మంగళవారం) గడువు ముగుస్తుందని సాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. సొసైటీ డైరెక్టర్ యర్రగుంట ఓబిరెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు ఈ ఏడాది అక్టోబర్ 1న అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్షలు ఉంటాయని తెలిపారు. పదో తరగతి, ఇంటర్ ఆపై తరగతులు చేసిన వారు అర్హులని పేర్కొన్నారు.

